

# నవభూమి

జిల్లా అనుబంధం

19 మే,2025 సోమవారం పేజీలు:4

www.epaper.navabhoomi.in


## గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా

# సస్యశ్యామలం



**భద్రాద్రి కొత్తగూడెం మే 18 నవభూమి ప్రతినిధి :** గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే తన రాజకీయ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. సీతారామ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసి పది నియోజకవర్గాల్లో సాగునీరు అందిస్తామని చెప్పారు. సాగర్ నీళ్లు అందించని పక్షంలో రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి నీళ్లు అందజేస్తామని అన్నారు. ఇవాళ(శనివారం) కొత్తగూడెం, పాల్వంచలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద మూడు విద్యుత్ సబ్ స్టేషన్లకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంపీ రఘురాం రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. రైతులకు నష్టాలు లేని దీర్ఘకాలిక లాభాలు తెచ్చే ఆయిల్ పామ్ పంట సాగుబాట పట్టాలని సూచించారు. జాతీయ రహదారులతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రగతిబాట పట్టనుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకొచ్చారు. దేశంలోనే ఏకైక ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి కొత్తగూడెం కేరాఫ్‌గా నిలిచిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ కోసం ప్రభుత్వ పక్షాన గట్టి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పారిశ్రామికంగా తెలంగాణకే మణిహారమని చెప్పారు. భద్రాద్రి రామయ్య దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేలా రైల్వేలైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణ ఆయిల్ పామ్ హబ్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మారిందని అన్నారు. టెంపుల్ టూరిజం, ఏకో టూరిజం, ఇండస్ట్రీ టూరిజానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను

# విజయవంతం చేయాలి



**రామవరం,మే 18 నవభూమి ప్రతినిధి :** జూన్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులతో జరిగిన సమీక్ష సమావేశంలో రాజీకాదగిన పెండింగ్ క్రిమినల్ కేసులు, ఇ -పిటి కేసుల వివరాలను ఠాణాల వారిగా అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి అందరు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈసారి జరిగే జాతీయ లోక్ అదాలత్ లో అత్యధిక కేసులను పరిష్కరించడం ద్వారా జిల్లాను ఉన్నత స్థానంలోకి తీసుకురావడం కోసం పోలీస్ అధికారులు కృషి చేయాలని చెప్పారు. ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు తమ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని తెలిపారు. మోటార్ వాహన ప్రమాద బాధితుల కేసులలో కక్షిదారులకు న్యాయం జరగాలని సూచించారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో రాజీపడటం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు వృథా అవ్వవని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీ వారిగా పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, మనోవర్తి, మోటార్ వాహన ప్రమాద కేసులు, బ్యాంక్ కేసులు, టెలిఫోన్ కేసులు, సైబర్ క్రైమ్ కేసులు పరిష్కరించుకొనుటకు కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సాయిశ్రీ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు, పీపీ పీవీడీ లక్ష్మి, ఏపీపీలు, పోలీస్ అధికారులు, సీనియర్ న్యాయవాదులు ఎస్వీ రామారావు, బాగం మాధవరావు, గాదే రామచంద్ర రెడ్డి, అంబటి రమేశ్, మధుకర్ పాల్గొన్నారు

## కిన్నెరసాని నదిపై హై లెవెల్ వంతెన ప్రారంభం

**పాల్వంచ, మే 18 నవభూమి ప్రతినిధి :** పాల్వంచ మండలంలోని యానం బైల్ గ్రామం వద్ద గల కిన్నెరసాని నదిపై రూ.9.70 కోట్ల వ్యయంతో నిర్మించిన హై లెవెల్ వంతెనను రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం ప్రారంభించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఈ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వంతెనను దాదాపు పూర్తి చేయడం జరిగింది. అసెంబ్లీ ఎన్నికలు రావడం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంతెనకు ఇరువైపుల అప్రోచ్ రోడ్లను ఇటీవల కాలంలో పూర్తి చేశారు అలాగే మండలంలోని బిక్కుతండా, సోములగూడెం గ్రామాల మధ్య గల బూడిద వాగుపై రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించే హై లెవెల్ వంతెన నిర్మాణానికి డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాం రెడ్డి ఎమ్మెల్యేలు కూనమనేని సాంబశివరావు, రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఎంపీడీఓ విజయభాస్కర్ రెడ్డి, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మావోయిస్టులతో వెంటనే

# శాంతి చర్చలు జరపాలి

- కగార్ ఆపరేషన్ తక్షణం విరమించాలి
- ఈనెల 18 నుంచి 24 తేదీ వరకు దేశవ్యాప్తంగా కార్యక్రమాలు
- ట్రంప్ ప్రభుత్వానికి మోకరిల్ల వద్దు
- సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డిమాండ్



**టేకులపల్లి మే 18 నవభూమి ప్రతినిధి :** ఆపరేషన్ కగార్ ను తక్షణం నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీతో వెంటనే శాంతి చర్చలు ప్రారంభించాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర, రాష్ట్ర కమిటీలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జె.వి. చలపతిరావు, సాధినేని వెంకటేశ్వరరావు, కె గోవర్ధన్ లు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. భారత్, పాక్ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం కొనసాగిన కాలంలో, కర్రీ గుట్టల నుండి కేంద్రం సాయుధ బలగాలను వెనక్కి పిలిపించుకున్నదని, ఇక ఈ ప్రాంతంలో అప్పటివరకు కొనసాగిన భీతావహ పరిస్థితి సమసిపోయి, ప్రశాంత వాతావరణం నెలకొంటుందని ప్రజలు భావించారు. కానీ కేంద్ర బలగాలు వైదొలిగినా కూడా అక్కడ అదే రకమైన పరిస్థితులు, ప్రధానంగా ఆదివాసులపై ఎనలేని నిర్బంధం అణిచివేత యధావిధిగానే కొనసాగుతున్నాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి తోడు సాక్షాత్తు దేశ పాలకులు, పోలీసు ఉన్నతాధికారులు ఆపరేషన్ కొనసాగి తీరుతుందని మావోయిస్టు పార్టీతో చర్చలు లేనే లేవనే ప్రకటనలకు తెగబడుతున్నారు. ఇది దేశ ఆదివాసి సమూహాల పట్ల పాలకులు అవలంబిస్తున్న, అనుమతించరాని క్రూర ఫాసిస్టు వైఖరిని తెలియజేస్తున్నదని వారు దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న ఆపరేషన్ కగార్ లో ఇప్పటికే దాదాపు 500 మంది వరకు ఆదివాసీలు, మావోయిస్టులు హతమైపోయారు. వందలు, వేలాది సాయుధ దళాల పద ఘట్టనలు నేడు కర్రెగుట్టలు మొదలుకొని మొత్తం దండకారణ్యంలో అనునిత్యం హత్యాకాండకు కారణం అవుతున్నాయని వారు పేర్కొన్నారు. ఇటీవలనే పోలీసులు జరిపిన కాల్పుల్లో డాక్టర్ రవి ప్రాణాలు కోల్పోయాడు. నెలరోజుల వ్యవధిలో దాదాపు 30 మంది మావోయిస్టులు హత్యకు గురైనట్లు పోలీసు వర్గాలే వెల్లడిస్తున్నాయి. కేంద్ర బలగాలు కర్రెగుట్టల ప్రాంతం నుండి వెనక్కి తరలిపోతున్నట్లుగా ప్రకటించినప్పటికీ ఆదివాసీలు, మావోయిస్టుల హత్యలు మాత్రం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ హత్యలను ఆపవలసిన అవసరం ఎంతగానో ఉందని తమ పార్టీ భావిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ ఆరు నెలల పాటు కాల్పుల విరమణ ప్రకటించి, తాము బేషరతు చర్చలకు సిద్ధం అంటూ ముందుకు వచ్చిన సందర్భంలోనూ కేంద్రం నిరాకరిస్తున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా కేంద్ర ప్రభుత్వం వైఖరి ఇదే అన్నట్లుగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, పోలీస్ ఉన్నతాధికారులు నిరంకుశంగా ఉంటూ, మావోయిస్టులను అణచివేస్తామని మళ్లీ మళ్లీ ప్రకటించడం అప్రజాస్వామిక విధానమే కాకుండా పూర్తిస్థాయి ఫాసిస్టు నియంతృత్వ చర్యగా తమ పార్టీ దృఢంగా భావిస్తున్నట్లు వారు స్పష్టం చేశారు. ఆ మేరకు కేంద్రం వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, కర్రెగుట్టలు తదితర దండకారణ్య ప్రాంతాల నుండి సాయుధ బలగాలను, క్యాంపులను తరలించాలని తమ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు వారు ప్రకటించారు. పెహల్గాం హత్యలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని, యుద్ధం వద్దని, ట్రంప్ ప్రభుత్వానికి మోకరిల్ల వద్దని, ఆపరేషన్ సింధూర్ లో దాగి ఉన్న అన్ని కోణాలను బహిర్గతం చేయాలని, ఆపరేషన్ కగార్ ను వ్యతిరేకిస్తూ ఈనెల 18 నుండి 24వ తేదీ వరకు దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని తమ పార్టీ కేంద్ర కమిటీ పిలుపు ఇచ్చిందని వారు తెలిపారు. ఈ పిలుపును అనుసరించి తెలంగాణలోని అన్ని జిల్లాల్లో కార్యక్రమాలు కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు ఇవ్వడం జరిగిందని వారు పేర్కొన్నారు

# చింతలచెరువు శ్రీ ఆత్మలింగేశ్వర ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్సవం





**పాల్వంచ టౌన్ మే 18 నవభూమి ప్రతినిధి:** పాత పాల్వంచ చింతలచెరువు కట్ట వద్ద గల శ్రీ ఆత్మలింగేశ్వర ఆలయంలో ఈనెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు జరుగుతున్న శ్రీ ఆత్మ లింగేశ్వర స్వామి దేవాలయ జీర్ణోధరణ పూర్వక ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తుండటం జరుగుతున్నది. ఆదివారం దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు సతీమణి విమలాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆత్మలింగేశ్వర సేవా సమితి ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరుగుతున్న పూజ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఆత్మ లింగేశ్వర స్వామి ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాల్లో దేవాలయం ప్రధాన అర్చకులు సర్వదేవభట్ల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# తిరంగా ర్యాలీని జయప్రదం చేయండి

## బిజెపి అధికార ప్రతినిధి వీరభద్ర ప్రసాద్

**ఖమ్మం, నవభూమి మే 18:** నేడు సాయంత్రం 5 గంటలకు ఖమ్మం ట్యాంక్ బండ్ పైన జరగనున్న తిరంగా ర్యాలీనీ జయప్రదం చేయాలని భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి మారుతి వీరభద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఖమ్మం నగరంలో26,37 డివిజన్లలో పలువురిని కలిసి అవగాహన కల్పించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం దేశ భద్రతతో పాటు ప్రజలకు అండగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వాలు తీసుకోలేని ఎన్నో కార్యక్రమాలని దిగ్విజయంగా ముందుకు తీసుకొని పోతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రతి ఒక్కరికి భరోసా కల్పిస్తూ ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ఖ్యాతిని చాటి చెబుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయవాదులు మారుతి వీరభద్ర ప్రసాద్, మంద సరస్వతి, వేదులకార్తీక్ శర్మ, దుగ్గిరాల సత్యనారాయణ, 26,37, డివిజన్లలో పెద్దలు దారా శ్యామ్, పసుమర్తి సంతోష్, మేకల నాగేంద్ర, బండారు శ్రీనివాసరావు, ఆకులు మురళి తదితరులు పాల్గొన్నారు.




# పెద్దమ్మ తల్లిని అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు





**పాల్వంచ టౌన్ మే 18 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశవాపురం- జగన్నాధపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం ( పెద్దమ్మ గుడి) లో ఆదివారం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండి పరిసర గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండే కాక ఇతర జిల్లాల నుండి భక్తులు అత్యధిక సంఖ్యలో విచ్చేసినారు. తమను చల్లంగా చూడాలని వేడుకుంటూ బోనాలు సమర్పించారు. అన్నప్రా శనలు, వాహన పూజలు, తలనీలాలు, అమ్మవారికి ఒడి బియ్యం, చీరలు, కనుములు, తదితర మొక్కులను చెల్లించుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదములను స్వీకరించారు. భక్తులకు అవసరమైన ప్రత్యేక దర్శనమునకు క్యూలైన్లు, ఉచిత పులిహోర ప్రసాద వితరణ, మంచినీటి వసతి తదితర ఏర్పాట్లను దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి, పాలకమండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ధర్మకర్తలు చీకటి కార్తీక్, పెండ్లి రాంరెడ్డి, ధర్మరాజుల నాగేశ్వరరావు, చెవుగాని పాపారావు, దేవస్థాన సిబ్బంది, పర్యవేక్షించారు

# ఫాదర్ వినయ్‌కి ఘన సన్మానం

## ■ సేవలను ప్రశంసించిన కామేపల్లి ఆర్‌సియం చర్చి సంఘస్తులు



**కామేపల్లి,నవభూమి, మే 18 :** కామేపల్లి ఆర్.సి.యం చర్చి సంఘస్తులు ఫాదర్ గార వినయ్ ను ఆదివారం శాలు వా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మా నించారు.సింగరేణి విచారణ గురువులు, స్థానిక చర్చి ఫాదర్ వినయ్ ముదిగొండ మండలం బాణాపురంకు బదిలీ కావ డంతో సంఘస్తులు ఘనంగా సన్మానించా రు.రెండేళ్లు పాటు వారు అందించిన సేవ లను ప్రశంసించారు.ఫాదర్ వృత్తికే విన య్ వన్నెతెచ్చారని అన్నారు.సంఘ అభ్యు న్నతికి చర్చి అభివృద్ధికి ఎనలేని విధంగా సేవలు అందించారని అభినందించారు. సాంప్రదాయ బద్ధంగా వీడ్కోలు పలికారు. రెండేళ్లపాటు తనకు సహకరించిన సం ఘంలోని ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఫాద ర్ వినయ్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తె లిపారు.తొలుత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.జీసస్ సందేశాన్ని ఫాదర్ వివరించారు.ఘనంగా నిర్వహించిన ఈ సన్మానోత్సవ కార్యక్రమంలో పంతులు శీల పాక వీరభద్రం,సంఘస్తులు చిలుముల ఆనందరావు, శీలపాక శేషయ్య, మార్క పుడి రాంబాబు, బుట్టి ప్రభాకర్, చిలు ముల రమేష్, గోపి ఆర్యన్,మాధవి, సునీ త, చిలుముల ఉపేంద్రమ్మ, శీలపాక స త్యవతి, ప్రమీల,చిప్పలపల్లి నాగలక్ష్మి, స్వ రూప, కురపమ్మ, సైదమ్మ,దొడ్డిగర్ల ఆరో గ్యం, కురం రాంబాయమ్మ, చిలుముల భాగ్యమ్మ, రీనా, చిట్టి,మేదర లక్ష్మి, చిప్ప లపల్లి సింగ్,చిప్పలపల్లి కీర్తి,కుమారి, షా హినా తదితరులు పాల్గొన్నారు.

# సాహితీవేత్తలకు చక్కని వేదిక అక్షరి సమూహం



**అశ్వారావుపేట మే 18 నవభూమి ప్రతినిధి:** ప్రపంచం చేతిలో చరవాణి ఇమిడిపోయింది. ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలోసమాచార పారదర్శకత, పౌరసేవల పంపిణీకి చరవాణి ద్వారా వాట్సాప్ కీలక సాధనమయింది. అన్ని దేశాలలో ప్రభుత్వాలు సైతం సమాచార సౌకర్యార్ధం సామాజిక మాద్యమం పైననే అధారపడుతున్నాయి. ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు సమర్ధవంతంగా చేరువ కావడానికి సమాచార మార్పిడికి వాట్సాప్ ను వేదికగా చేసుకుంటున్నాయి. మన దేశంలో కూడా టెలికాం సేవలు విస్తృతస్థాయిలో అందబాటులో ఉండడంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ ప్రభుత్వాలు ప్రజలమధ్యన సమాచార అగాధాన్ని పూడ్చేందుకు వాట్సాప్ ఎంతో ఉపకరిస్తోంది. అన్ని రంగాలలో వాట్సాప్ ను తేలికగా వినియోగిస్తున్నారు. అంతే వేగంగా సాహిత్య రంగంలో కూడా వాట్సాప్ ను వినియోగిస్తున్నారు. అనేక సంస్థలు వాట్సాప్ సమూహాలను ఏర్పాటు చేసి సమాచారాన్ని క్షణాల్లో చేరవేస్తున్నారు. కొన్ని సంస్థలు కఠిన నియమాలను ఏర్పాటు చేసి చాలా అద్భుతంగా సేవలు అందిస్తున్నాయి. వీటిలో అత్యున్నత సాహితీ సేవలను అందించే అక్షరి వాట్సాప్ సమూహం సాహితీవేత్తలకు విలువైన సమూహంగా సేవలను అందిస్తుంది. వాజేడు కేంద్రంగా ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు తెలుగు భాషా సేవకుడు డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో 21 జులై 2021 తేదీన ఈ అక్షరి సమూహం ( సంపూర్ణ తెలుగు సాహితీ వేదిక) ఏర్పడింది. ప్రస్తుతం 644 మంది సభ్యులతో విరాజిల్లుతుంది. అక్షరిలో ప్రతిరోజు వివిధ అంశాలు సాహితీవేత్తలకు అందిస్తుంది. ప్రతిరోజు ఉదయం 5 గంటలకు పంచాంగం పోస్టు చేయబడుతుంది. వెనువెంటనే నేటి మంచి మాట అంటూ చక్రవర్తి ఆటవెలది పద్యంతో వీనుల విందు చేస్తారు. ప్రతిరోజు.. ఆనాటి సాహితీవేత్త జయంతి లేదా వర్ధంతి సమాచారం సాహితీ సుప్రభాతం ఉంటుంది. రోజువారి ప్రత్యేక సాహితీ వ్యాసాలు పోస్టు చేయబడతాయి. సహృదయతను పంచే సునంద సుభాషితం అందించబడుతుంది. ప్రతి ఆదివారం..అక్షరి సమూహ రచయితల పరిచయ వేదిక పరిచయ పత్రం ఉంటుంది. దీనిద్వారా రచయితల గురించి తెలుసుకోవచ్చును. ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత.ఆపాత మధురమైన ఆకాశవాణి నాటకం. ప్రసారం చేయబడుతుంది. ప్రతి సోమవారం పొద్దున 8 గంటల తర్వాత మళ్లీ విందాం శీర్షికన... సాహితీ పరమైన ప్రసంగాలు, రూపకాలు ఉంటాయి. ప్రతి మంగళవారం కవనమందారం లబ్ద ప్రతిష్టలైన కవుల కవితల సమాహారం. ప్రతి బుధవారం పుస్తక గవాక్షం పుస్తకాల పరిచయ వేదిక. ప్రతి గురువారం కాళోజీ కవనం ప్రజా కవి కాళోజి కవితలవిశ్లేషణ, ఆయన అనుచరుడు నాగిళ్ళ రామశాస్త్రి నిర్వహణలో అందించబడతాయి. ప్రతి శనివారం అక్షరి శోధన తెలుగు సాహితీ విశేషాలతో కూర్చిన ప్రశ్నావళి, ఐదు ప్రశ్నలకు 24 గంటల వ్యవధిలో సరైన సమాధానాలు పంపిన వారిని విజేతలుగా ప్రకటిస్తూ విలువైన పుస్తకాలు పి. డి.యఫ్ కానుకలుగా అందించబడుతున్నాయి. వీటితోపాటు ఆయా సందర్భాలను బట్టి.. విలువైన సాహితీ సమాచారాలు, వార్తలు, పోటీలు, ఫలితాలు .పక్ష, మాస పత్రికల పిడిఎఫ్ లు సమూహసభ్యులకు అందించబడతాయి. శతశాతం సాహితీ సమాచారయుతంగా.. సాగే ఈ సమూహం నేటి ఆధునిక వాట్సప్ సమూహాలన్నిటికీ ఆదర్శంగా నిలుస్తుంది...

**సమూహ విశ్లేషణ: సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు, అశ్వారావుపేట, సెల్: 9491357842**

## బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

**తిరుమలాయపాలెం నవభూమి మే 18-** తిరుమలాయ పాలెం మండలం ఎర్రగడ్డ గ్రామంలో నల్లమల్ల నీరన్ కుమార్ ఇంట్లో జరిగిన దొంగతనం విషయంలో స్థానిక పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు కాగా, అట్టి కేసులో అదే గ్రామానికి చెందిన కొంతమంది అనుమానితులను స్టేషన్ కు పిలిపించి విచారించగా దారమళ్ళ సందీప్ తండ్రి తిరపయ్య అను అతను నేరాన్ని అంగీకరించి అతని వద్ద వున్నా ఒక జత చెవి దిద్దులు ఇవ్వగా, మిగిలిన బంగారపు నెక్లేస్ ఎక్కడ అని సందీప్ ను అడగగా, అదే గ్రామానికి చెందిన బెల్లం అభిలాష్ తండ్రి వీరభద్రారావు కు ఇచ్చాను అని చెప్పడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకున్న అభిలాష్ నాకు ఎప్పుడు నెక్లేస్ ఇచ్చావు, నా పేరు ఎందుకు చెప్పావ్ అని బెదిరించడంతో ఏంచెయ్యాలో తెలియక కంగారు పడి భయంతో తిరుమలాయపాలెం వచ్చి తెలంగాణ ఆగ్రో ఏజన్సీస్ పురుగు మందుల షాప్ నందు గుర్తు తెలియని గడ్డి మందు తీసుకొని, నూతన డీసీసీబీ సొసైటీ ఆఫీస్ వెనుకాల కూల్ డ్రింక్ లో కలుపుకొని తాగిన తర్వాత అతని తండ్రి తిరుపయ్యకు, వాళ్ళ పెదనాన్న కు అతను గడ్డి మందు తాగానని సమాచారం ఇచ్చాడు. వాళ్ళు సందీప్ ను వెంటనే ఖమ్మం ప్రశాంతి హాస్పిటల్ లో జాయిన్ చేశామని, నా కొడుకును భయపెట్టి బంగారపు నెక్లేస్ ను ఇవ్వకుండా నీ అంతు చూస్తానని బెదిరించి, నా కొడుకు ఆత్మహత్య ప్రయత్నానికి కారణమైన బెల్లం అభిలాష్ పై చట్టరీత్యా చర్య తీసుకోగలరని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా బెల్లం అభిలాష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న తిరుమలాయ పాలెం ఎస్సై కూచిపూడి జగదీష్.

## మండల కేంద్రంలో పెట్రోల్ బంక్ ప్రారంభం





**అన్నపురెడ్డిపల్లి మే 18 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఆదివారం జెఎస్ఆర్ పెట్రోల్ బంక్ ను ప్రారంభించారు. మండల పరిధిలోని చుట్టు పక్కల వివిధ గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా హెచ్ పి పెట్రోల్ బంకును ప్రారంభించటం జరిగిందని బంక్ మేనేజర్ జంగాల శ్రీనివాసరావు తెలిపారు. వ్యాపార అభివృద్ధికి సహకరించాని కోరారు

## బాల్య వివాహాలు నివారించటం ప్రతి ఒక్కరి బాధ్యత - సీడీపీవో



**కారేపల్లి, నవభూమి, మే18 :** బాల్య వివాహాలు నివారించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని కామేపల్లి ప్రాజెక్టు సీడీపీవో దయమాణి అన్నారు. ఆదివారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజానికి ప్రతిబంధకాలని ఎన్నో అనర్థాలకు దారితీస్తాయని తెలిపారు. 18 ఏండ్లు నిండని బాలికలలో శరీరక, మానసిక పెరుగుదల, లైంగింక పరిపక్వత సరిగా ఉండదన్నారు. బాల్య విహహాల నిరోధక చట్టం ప్రకారం గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కార్యదర్శి, ఐసీడీఎస్ సూపర్వైజర్, తహసీల్దార్, సీడీపీవో, ఆర్డీవో, కలెక్టర్ లకు బాల్య వివాహాలు నిరోధించే అధికారం ఉందన్నారు. బాల్య వివాహం జరుగుతుందని తెలిస్తే 1098 కి కాల్ చేసి సమాచారం ఇస్తే హెల్ప్ లైన్ సిబ్బంది, కార్యదర్శి, పోలీస్, ఐసీడీఎస్ ఆ ఇంటిని సందర్శించి విచారించటం జరుగుతుందన్నారు. కారేపల్లి మండల చింతలపాడులో మైనర్ బాలిక కు ఈనెల 21న వివాహం చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నాయని తెలిసి అధికారులు వెళ్ళి బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వటం జరిగిందన్నారు. పెడచెవిన పెడితే చట్టప్రకారం వరుడుతో పాటు తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయన్నారు

## గత ప్రభుత్వాన్ని దూషిస్తే సమస్యలు పరిష్కారం కావు: పొన్నం హితవు

**ఎర్రుపాలెం, నవభూమి,మే18 :** కాంగ్రెస్ పార్టీ గత శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చ కుండా టీఆర్ఎస్ ను పదే పదే తిడితే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయా అని సిపిఎం పార్టీ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నంవెంకటేశ్వరరావు కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు.ఆదివారం మండల పరిధిలోని భీమవరం గ్రామంలో వివిధ పార్టీల నుండి సిపిఎం పార్టీలో చేరినవారికి పొన్నం వెంకటేశ్వరరావు జిల్లావర్గసభ్యులుమాదినేని రమేష్,డివి జన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావుల ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ కండువాలు కప్పిసాదరంగా ఆహ్వానించారు.ఈ సంద ర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్లనిర్మాణం పేరుతో 10 సంవత్సరాలు సాగదీసిందని అదేబాటలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. అర్హులైన పేదలకు కీలకమైన ఇందిరమ్మ పథకం వర్తించేలా 5 లక్షలలబ్ధిచేకూర్చేలా ఇళ్లు మంజూరు చేయాలన్నారు.నూతన పెన్షన్లు అమలుపరచాలని,4000 రూపాయలకు పెంచాలని, కార్డులేని ప్రతిపేదవారి కి కొత్తపెన్షన్ మంజూరు, మహాలక్ష్మిపథ కంకింద మహిళలకు 2,500 రూపాయలు అందించాలన్నారు .రైతుభరోసా ఆంక్షలు లేకుండా అమలు పరచాలని, కౌలుదారుకు సంవత్సరానికి 12 వేల రూపాయలు అందించాలని పేర్కొన్నారు.6 గ్యారంటీలను తక్షణమే అమలుపరిచి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపరచుకుంటే సిపిఎంపార్టీ ప్రజా సమస్యలపె అలుపెరగని పోరాటాలుచేసి పరిష్కారం అయ్యేవరకు పోరు సలుపుతామనిహెచ్చరించారు. పార్టీ లోచేరినఅయ్యవారిగూడెంసొసైటీ సభ్యు



లు తల్లపరెడ్డి ధనలక్ష్మి,తలపరెడ్డి సీతా రామరెడ్డి, తల్లపరెడ్డి వెంకటరెడ్డి,ప్రసన్న తదితరులను పార్టీలో చేర్చుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండలకార్యదర్శి మద్దాల ప్రభాకరరావు ,అయ్యవారి గూడెం సొసైటీసభ్యులు మేడ గాని తిరపతిరావు,గొల్లపూడి శ్రీహరి,నారా యణ,పెద్ద కోటేశ్వరరావు,మండల కమిటీ సభ్యులు హనుమంతరావు, గామాసు జోగ య్య, నాగుల వంచ వెంకట్రామయ్య, దూదిగం బసవయ్య, చిత్తూరు కిషోర్, మందడపు ప్రభాకర్,లాల తదితరులుపాల్గొన్నారు

## సింధూర్‌కు సంఘీభావంగా భారీ తిరంగా ర్యాలీ












**కొత్తగూడెం మే 18 నవభూమి ప్రతినిధి:** లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డ్ నుండి సూపర్ బజార్ సెంటర్ వరకు జాతీయవాదులు కొత్తగూడెంలోని పుర ప్రముఖుల ఆధ్వర్యంలో సైన్యానికి ఆపరేషన్ సింధూర్ సంఘీభావంగా ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు చేతబట్టి పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ఉగ్రవాదంపై పోరు కొనసాగుతుందని, పోరు ఆగదని ఈ సందర్భంగా ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో పట్టణ ప్రముఖులు, జాతీయవాదులు ప్రముఖ న్యాయవాది జాతీయ వాది జీవీకే మనోహర్రావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి,మాజీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, జాతీయవాదులు ఎల్దండి, పూర్ణ, బండి భాస్కర్ బి ఎం ఎస్ జాతీయ నాయకులు మాధవ నాయక్ బిఎంఎస్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, న్యాయవా నరేంద్రబాబు క్రీడా సంఘాల నాయకులు గొట్టె పురాధాకృష్ణ, మహేందర్ బిజెపి నేతలు, బలగం శ్రీధర సొప్పరి, క్రాంతి,విద్యాసాగర్, తుంపూరి శివ నరహరి, చిట్టి మల్ల చంద్రశేఖర్ పసుమర్తి అనంతం, కొత్తగూడెంలోని జాతీయవాదులు పుర ప్రముఖులు తదితర పార్టీల నాయకులు పట్టణ ప్రముఖులు ఎన్ సి సి విద్యార్థులు పాల్గొన్నారు

## పట్టాలు దాటుతుండగా ఊహించని ఘటన

**రంగారెడ్డి, మే 18 నవభూమి ప్రతినిధి:** అదృష్టం కలిసి వస్తే ఎంత పెద్ద ప్రమాదం నుంచి అయినా తప్పించుకుంటారు కొందరు. లేకపోతే చిన్న ప్రమాదాలకే ప్రాణాలు కోల్పోతుంటారు. పెద్ద పెద్ద ఆక్సిడెంట్‌ల నుంచి ఎలాంటి దెబ్బలు తగలకుండా కొంతమంది ప్రాణాలతో బయటపడతారు. వీరిని చూసే అంటారేమో వీళ్లకు భూమి మీద ఇంకా నూకలు ఉన్నట్టున్నాయి అని. ఇలాంటి ఘటనే రంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. ఓ కార్మికుడు తన పనిని ముగించుకుని ఇంటి బాట పట్టాడు. ఈ క్రమంలో అతడు రైలు పట్టాలు దాటాల్సి వచ్చింది. కానీ ఇంతలోనే ఊహించని ఘటన చోటు చేసుకుంది. అసలేం జరిగిందో ఇప్పుడు చూద్దాం. రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌లో ఓ కార్మికుడు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. కంపెనీలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ వద్ద రైలు పట్టాలు దాటుతున్నాడు. అయితే అక్కడున్న గూడ్స్ ట్రైన్ అకస్మాత్తుగా ముందుకు కదలడంతో ఆ కార్మికుడు రైలు పట్టాలపై పడుకున్నాడు. గూడ్స్ ట్రైన్ వెళ్లిపోయిన తర్వాత ప్రాణాలతో బయటపడ్డాడు. నిన్న (గురువారం) సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. తిమ్మాపూర్ ఒక పారిశ్రామిక వాడ. తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ చుట్టూ అనేక పరిశ్రమలు ఉంటాయి. ఒక సైడ్ రెసిడెన్షియల్ క్వాటర్స్ ఉండగా, మరో పక్క పరిశ్రమలు ఉంటాయి. తరచుగా అటూ ఇటూ వెళ్లేవాళ్లంతా పుట్‌ఓవర్ బ్రిడ్జ్‌ను ఉపయోగించకుండా కింద నుంచే వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో బీహార్‌కు చెందిన ఓ కార్మికుడు ఆగి ఉన్న గూడ్స్ రైలు ముందు నుంచి వెళ్తున్నాడు. అయితే అకస్మాత్తుగా గూడ్స్ రైలు కదిలింది. ఈ సమయంలో ఏం చేయాలో తెలియక ఓ క్షణం భయాందోళనకు గురయ్యాడు. మళ్లీ అంతలోనే ప్రాణాలు దక్కించుకునేందుకు ట్రాక్ మధ్యలో పడుకుండిపోయాడు. మొత్తం గూడ్స్ రైలు వెళ్లిన తర్వాతే సదరు కార్మికుడు లేవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు.

# బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఆర్థిక చేయూత



**జూలూరుపాడు, మే 19 (నవభూమి ప్రతినిధి)-** మండల పరిధిలోని అనంతారం గ్రామంలో నాలుగు రోజుల వ్యవధిలో ముగ్గురు మహిళలు అనారోగ్యంతో మరణించారు.కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు లేళ్ల వెంకట రెడ్డి,మండల అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్ సూచనలతో స్పందించిన గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక్కో కుటుంబానికి 5000 చొప్పున మూడు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు.బాధిత కుటుంబాలకు మేమున్నామంటూ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొర్సా రమేష్,ఉసికల వెంకటేశ్వర్లు,మలకం వీరభద్రం,బండారు పుల్లారావు,నరేష్,కల్తీ హనుమంతరావు,కుంజా సతీష్, మందెరికల తిరుమలేశ్, ఈసం పాపారావు పోగుల నరసింహారావు, ఘనప శ్రీకాంత్,వజ్జా సందీప్,ఎట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# తల్లాడ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన అధ్యక్ష కార్యదర్శులు ఎన్నిక



**తల్లాడ, నవభూమి, మే18:** తల్లాడ మండలంలో తల్లాడ లైన్స్ క్లబ్ అధ్యక్షులుగా కోడూరు నాగేశ్వరరావు, సెక్రటరీగా నంబూరు కనకదుర్గ ప్రసాద్, ట్రెజరర్ గా అనుమోలు సర్వేశ్వరరావు, నూతన తల్లాడ లైన్స్ క్లబ్ సభ్యులు, చార్టెడ్ సభ్యులు, అందరి అనుమతితో ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు కర్నాటి లక్ష్మారెడ్డి, దారా శ్రీనివాసరావు, వెమి రెడ్డి వెంకట్ నారాయణ రెడ్డి, బెల్లంకొండ ఆంజనేయులు, శీలం వెంకటరెడ్డి, మారెళ్ళ వెంకటేశ్వరరావు, నున్న చిన్న తిరుమలరావు, తోట మురళి, పొట్టేటి అంకిరెడ్డి, మొదలగు సభ్యులు నూతనంగా ఎన్నుకోబడిన సభ్యులకు శాలవాలతొ వారిని సన్మానించడం జరిగింది

# సుందరయ్య 40 వ వర్ధంతి సభకు హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**తల్లాడ, నవభూమి మే 18:** తల్లాడ మండలం కుర్నవల్లి లో ఆదర్శ నేత పార్లమెంట్ తొలి ప్రతిపక్ష నేత పేదల పక్షపాతి సిపిఎం వ్యవస్థాపకులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభ ది 19-05-2025 సాయంత్రం ఐదు గంటలకు జరుగుతుంది. కావున ఈ సభకు ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ మరియు రాష్ట్ర జిల్లా డివిజన్ మండల నాయకులు పాల్గొంటున్నారు. కావున సిపిఎం పార్టీ సభ్యులు సానుభూతిపరులు తల్లాడ మండల పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు

# విజయవంతమైన సురక్ష మెగా హెల్త్ క్యాంప్





**జూలూరుపాడు, మే 18 (నవభూమి ప్రతినిధి)-** మండల కేంద్రంలో గల సాయి ఎక్స్ లెంట్ పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం సురక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 450 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తక్కలపల్లి వరుణ్,డాక్టర్ రుద్ర గౌతమ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే సత్ సంకల్పం తో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇదే కాక మా ఆసుపత్రిలో సైతం పేదలకు చేయూతనిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఆరోగ్య శిబిరంలో డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అప్పిరెడ్డి,డాక్టర్ భరత్ కుమార్,సి పి ఐ నాయకులు దొండపాటి రమేష్,గుండె పిన్ని వెంకటేశ్వర్లు,చాంద్ పాషా,ఎల్లంకి మధు,సి పి ఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు వల్లోజి రమేష్,సురక్ష హాస్పిటల్ మేనేజర్ సైదులు పి ఆర్ ఓ సునీల్ సిబ్బంది ఉమా,రేష్మ, మాధురి, తేజ, సందీప్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు

# వారిని ఇబ్బందులు పెట్టొద్దు.. అధికారులకు మంత్రి సీతక్క క్లాస్



**హైదరాబాద్ మే 18 నవభూమి ప్రతినిధి:** ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు చాలా ఇబ్బందులు పడుతున్నారని మంత్రి సీతక్క అన్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇవాళ(శనివారం) తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ములుగు నియోజకవర్గానికి సంబంధించి ఏజెన్సీ ప్రాంతాల్లో నూతన రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణం, పెండింగ్ పనులు, పనుల పురోగతిపై మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీసీసీఎఫ్ డాక్టర్ జి.అపర్ణ, ములుగు, మహబూబాబాద్ డీఎఫ్ఓలు, ఐటీడీఏ ఇంజనీర్లు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. అటవీ చట్టాలు, అభయారణ్య చట్టాలకు లోబడి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గుడులు, బడులు, ఆస్పత్రులు, కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్వోఎఫ్ఆర్ చట్టం అడ్డుకాదని మంత్రి సీతక్క గుర్తు చేశారు. అందుకే అటవీ అభయారణ్య చట్టాలను సమన్వయం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఏజెన్సీ ఏరియాల్లో దేవాదుల వంటి ప్రాజెక్టులు నిర్మించినప్పుడు, తరతరాలుగా అడవుల్లో నివసిస్తున్న ప్రజల అవసరం మేరకు రోడ్లు నిర్మించడంలో అభ్యంతరాలు ఎందుకని అటవీ శాఖ అధికారులను మంత్రి సీతక్క ప్రశ్నించారు. దుబ్బగూడం, కొండపర్తి వంటి గ్రామాలకు రహదారులు లేకపోవడం వల్ల కనీసం అంబులెన్స్ వెళ్లే పరిస్థితి లేదని మంత్రి సీతక్క చెప్పారు. అందుకే నిబంధనల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని మంత్రి సీతక్క సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని మంత్రి సీతక్క గుర్తు చేశారు. అటవీశాఖ అధికారులు, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, ఐటీడీఏ అధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకొని కనీస రహదారి సదుపాయాలు కల్పించాలని మంత్రి సీతక్క సూచించారు.మంత్రి సీతక్క ఆదేశాలతో కనీస రహదారుల నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు కల్పించబోమని అటవీ అధికారులు చెప్పారు. అటవీ, అభయారణ్య చట్టాలు నిబంధనలకు అనుగుణంగా రోడ్లు, కల్వర్టులు, లోకాజ్ వేల నిర్మాణానికి ప్రత్యామ్నాయ మార్గం చూస్తామని పీసీసీఎఫ్, అటవీ శాఖ అధికారులు, డీఎఫ్ఓలు హామీ ఇచ్చారు. తారు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి అటవీ అభయారణ్య చట్టాలు అంగీకరించని పక్షంలో పటిష్టంగా ఉండేలా గ్రావెల్, మట్టి రోడ్ల నిర్మాణాలను చేపడతామని అటవీశాఖ అధికారులు చెప్పారు. ములుగు నియోజకవర్గ ఏజెన్సీలో పెండింగ్ పనుల జాబితాను అటవీ శాఖ అధికారులకు అందించి.. ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ విభాగంతో చర్చించి పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు

# పోస్ట్‌మార్టం పూర్తి.. మృతదేహాలు బంధువులకు అప్పగింత

**హైదరాబాద్ మే 18 నవభూమి ప్రతినిధి:** చార్మినర్ సమీపంలోని గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మృతి చెందిన వారికి ఉస్మానియా ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం పూర్తయింది. అనంతరం ఆయా మృతదేహాలను బంధువులకు వైద్యులు అప్పగించారు. మృతదేహాల అప్పగింత కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ స్వయంగా పర్యవేక్షించారు. గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదంలో మరణించిన వారిలో పలువురు హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు. ఈ నేపథ్యంలో మృతదేహాలను అత్తాపూర్ సన్ రైజ్ విల్లాస్‌కు, బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 12కి రెండు, సనత్ నగర్ స్వామి థియేటర్ బ్యాక్ సైడ్ 1, మోతి నగర్‌లోని రాజీవ్ నగర్‌కి మూడు మృతదేహాలు తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకోగానే.. ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆసుపత్రికి చేరుకున్నారు. హైదరాబాద్ మహానగరంలోని చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గుల్జార్ హౌస్‌లోని మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. ఇంట్లో ఏర్పాటు చేసిన ఏసీ కంప్రెషర్ పేలి మంటలు చెలరేగినట్లు పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో తొలుత 11 మంది చనిపోయారు. ఆ తర్వాత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పలువురు మరణించారు. ఆ తర్వాత మృతుల సంఖ్య మరింత పెరిగింది. ఈ అగ్ని ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

**అగ్నిప్రమాద బాధితులకు రూ.5లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా**

పాతబస్తీలో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు తెలంగాణ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఒక్కొక్కరికీ రూ.5లక్షలు చొప్పున ఇవ్వనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. అగ్నిప్రమాదం జరగడం



అత్యంత దురదృష్టకరమన్న భట్టి.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరితో మాట్లాడుతూ ఘటనపై వేగంగా స్పందించారని చెప్పారు. అగ్నిప్రమాద ఘటన జరిగిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఫైర్ శాఖ సహా సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు వివరాలు అడిగి తెలుసుకున్నారని భట్టి చెప్పారు. ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందని ప్రాథమికంగా తేలిందన్న భట్టి.. విపరీతమైన పొగ చెలరేగడంతో ఊపిరాడక 17 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు అండగా నిలబడతామని, అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని డిప్యూటీ సీఎం అన్నారు. తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అగ్నిప్రమాద స్థలానికి హుటాహుటిన వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యల్ని వేగవంతం చేశారు. ఇదిలా ఉండగా.. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.20లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరింది. ఘటన చాలా దురదృష్టకరమన్న ఆ పార్టీ నేత హరీశ్ రావు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉండాలన్నారు.